క్లుప్తంగా

నేడు మెగా జాబ్ మేళా

హాలియా : నాగార్జున సాగర్ నియోజకవర్గ నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి కల్పనే లక్ష్యంగా మెగా జాబ్ మేళాను ఏకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆకాంక్ష హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఆ ఫౌండేషన్ చైర్మన్ కట్టెబోయిన అనిల్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళా ఉదయం 11.00 నుంచి ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఈ మెగా జాబ్ మేళాలో 10వ, ఇంటర్, ఎంఎల్‌టీ, బీఎస్సీ నర్సింగ్, డిగ్రీలో బీఏ, బీకాం, బీఎస్సీ, ఎంసీఏ, ఎంబీఏ, ఎంఎస్సీ, డిప్లొమా ఐటీఐ, బీటెక్(ఈఈఈ) పూర్తి చేసిన వారికి అవకాశం ఉంటుందని తెలిపారు. ఇంటర్వ్యూకు హాజరై వారు తమ వెంట ఒరిజనల్ సర్టిఫికెట్లతో రెసూ్యమ్ మూడు సెట్లు, ఆధార్‌కార్డు మూడు సెట్లు, జిరాక్స్‌లను తీసుకోని రావాలని కోరారు. ఈ అవకాశాన్ని నాగార్జున సాగర్ నియోజకవర్గ నిరుద్యోగ, యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే చర్యలు

కొండమల్లేపల్లి : అనుమతులు లేకుండా పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తే చట్టరీత్య చర్యలు ఉంటాయని పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో సాగర్ రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు మిల్లర్లు ప్రభుత్వ లెవీ బియ్యం కోసం ఇచ్చిన ధాన్యం అమ్మి ఇతర రాష్ట్రాల నుంచి చవక బియ్యం దిగుమతి చేసుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నట్లు పేర్కొన్నారు. అక్రమంగా బియ్యం రవాణాకు పాల్పడితే వాహనాలను సీజ్ చేస్తామన్నారు.

శేఖర్‌రెడ్డికి నివాళి

దేవరకొండ : దేవరకొండ మండల పరిధిలోని పద్మట్‌పల్లి గ్రామానికి చెందిన సీపీఐ గ్రామ శాఖ మాజీ కార్యదర్శి పల్లా శేఖర్‌రెడ్డి ఆశయ సాధనకు కృషి చేయాలని ఆ పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం శేఖర్‌రెడ్డి ప్రథమ వర్ధంతి కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహ్మారెడ్డి, రమావత్ అంజయ్యనాయక్ , నర్సింహ, దేవేందర్‌రెడ్డి, వెంకటరమణ, బుచ్చిరెడ్డి, మైనొద్దీన్ పాల్గొన్నారు.

హాస్టల్ వార్డెన్లు స్థానికంగా ఉండాలి

దేవరకొండ : హాస్టల్ వార్డెన్లు స్థానికంగా ఉండాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా కార్యదర్శి కుంభం నరేష్ అన్నారు.గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవరకొండ నియోకవర్గ పరిధిలో గల పలు బీసీ, ఎస్సీ, ఎస్టీ హాస్టల్ వార్డెన్లు స్థానికంగా ఉండకపోవడంతో ఆయా హాస్టళ్ల విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో అనిల్, సురేష్, నాగార్జున, ఆంజనేయులు, భాను పాల్గొన్నారు.

జనచైతన్య యాత్రను విజయవంతం చేయాలి

మిర్యాలగూడ అర్బన్ : ఈ నెల 26వ తేదీన మిర్యాలగూడలో జరిగే జనచైతన్య యాత్రను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎండీ.అయ్యూబ్ అన్నారు. గురువారం పట్టణంలోని బంగారుగడ్డలో నిర్వహించిన ప్రచారంలో భాగంగా కరపత్రాలను పంపిణీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. 26న సాయంత్రం నాలుగు గుంటలకు మున్సిపల్ కాంప్లెక్స్ వద్ద జనచైతన్య యాత్ర బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లయ్య, లక్ష్మమ్మ, నాగూర్‌మీరా, తదితరులున్నారు.

ఉచిత వైద్యశిబిరం

అడవిదేవులపల్లి : మండలంలోని చాంప్లాతండాకు చెందిన ఆంగోతు నాగేశ్వర్‌రావు ప్రథమ వర్ధంతి సందర్భంగా గురువారం ఆయన కుమారుడు, ఆలంపూర్ సీఐ సూర్యానాయక్ ఆధ్వర్యంలో ఫిజియోథెరపీపై ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి సుమారు వందమందికి పైగా వచ్చి పరీక్షలు నిర్వహించుకున్నారు. అదే విధంగా ఆరోతరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు రూ.50వేల విలువ గల తెలుగు, హిందీ, ఇంగ్లీశ్‌లో ముంద్రించి డిక్షనరీలను సీఐ సూర్యానాయక్ అందజేశారు.

దేవాలయ నిర్మాణ పనులకు శంకుస్థాపన

కొండమల్లేపల్లి : మండలంలోని చిన్నఅడిశర్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని బుడ్డోనితండాలో శ్రీ వేంకటేశ్వరస్వామి, ఆంజనేయస్వామి దేవాలయాల నిర్మాణాలకు గురువారం సర్పంచ్ గడ్డం శ్రీరాములు తదితరులు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ దైవ చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని అన్నారు. బాబుజీ, జగ్రు నాయక్, సత్యనారాయణ పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరం ప్రారంభం

వేములపల్లి : మొండలంలోని మొల్కపట్నం గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు, స్థానిక సర్పంచ్ నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గోవర్ధని, ఉపసర్పంచ్ కరుణాకర్, రోహిత్‌రెడ్డి, సూపర్‌వైజర్ అబ్దుల్లా, హెచ్ ఎ.శ్రీధర్, పద్మ, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములకు రక్షణ

- దామరచర్ల, మిర్యాలగూడ మండలాల్లో కబ్జాకు గురైన భూములపై 'సాక్షి' ఫోకస్
- 'పునరావాస భూములు హాంఫట్' 'ప్రభుత్వ భూమిని కాజేయాలని..' శీర్షికలతో కథనాలు
- ఆ కథనాలకు కలెక్టర్ స్పందించి హెచ్చరిక బోర్డులు, హద్దులు ఏర్పాటు


ప్రభుత్వ భూమిలో అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

మిర్యాలగూడ : మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలోని దామరచర్ల మండలంలో నాగార్జునసాగర్ డ్యాం నిర్మాణంలో భూములు కోల్పోయిన 87 మంది కుటుంబాలకు దామరచర్ల మండలంలోని సర్వే నంబర్ 430లో 495 ఎకరాల భూములను సాగుకు, 20 ఎకరాలను ఇళ్ల స్థలాలకు ప్రభుత్వం కేటాయించింది. మండలానికి చెందిన కొందరు కబ్జాదారులు ఇళ్ల స్థలాలకు సంబంధించిన 20 ఎకరాల భూమిని ఆక్రమించారు. దీనిపై 2023 జనవరి 9న సాక్షి దినపత్రికలో 'పునరావాస భూములు హాంఫట్' శీర్షికతో కథనాన్ని ప్రచురించింది. ఈ కథనానికి స్పందించిన కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి ఈ భూములపై వెంటనే విచారణ చేపట్టాలని మిర్యాలగూడ ఆర్డీఓ, దామరచర్ల తహసీల్దార్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఆక్రమణకు గురైన 20 ఎకరాలను సర్వే చేసి హద్దులు నిర్ణయించి భూమిలో బోర్డు పెట్టారు.



సాక్షిలో ప్రచురితమైన 'పునరావాస భూములు హాంఫట్' కథనం

ప్రభుత్వ భూమికి హద్దులు..



సాక్షిలో ప్రచురితమైన 'ప్రభుత్వ భూమిని కాజేయాలని' కథనం


జప్తివీరప్పగూడెంలో ప్రభుత్వ భూమిలో అధికారులు ఏర్పాటుచేసిన హెచ్చరిక బోర్డు

మిర్యాలగూడ మండలం జప్తివీరప్పగూడెంలో వెంచర్ పక్కన ఉన్న 20 ఎకరాల ప్రభుత్వ భూమిని అక్రమించేందుకు కొందరు ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. దీనిపై 2023 జనవరి 17న 'సాక్షి'లో 'ప్రభుత్వ భూమిని కాజేయాలని..' అనే శీర్షికన కథనం ప్రచురించడంతో కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి స్పందించారు. గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూమిని సర్వే చేసి నివేదికను సమర్పించాలని ఆర్డీఓకు, తహసీల్దార్‌కు ఆదేశాలు జారీ చేశారు. అధికారులు ప్రభుత్వ భూమిని సర్వే చేసి హద్దురాళ్లను ఏర్పాటు చేశారు.

'సాక్షి'తో విద్యార్థుల కష్టాలు దూరం

- 174 మంది బాలికలకు ఒక్కటే శీర్షికన 'సాక్షి' మెయిన్‌లో కథనం
- పులిచర్ల జెడ్పీహెచ్‌ఎస్‌లో దాతలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో మూత్రశాలలు ఏర్పాటు


ప్రచురితమైన కథనం


నూతనంగా నిర్మించిన మరుగుదొడ్లు

పెద్దవూర : మండలంలోని పులిచర్ల జెడ్పీహెచ్‌ఎస్‌లో మూత్రశాలల కొరతతో బాలికలు పడుతున్న ఇబ్బందులపై 'సాక్షి' మెయిన్‌లో 2021 డిసెంబర్ 10వ తేదీన '174 మంది బాలికలకు ఒక్కటే' శీర్షికన ప్రచురించిన కథనానికి పలువురు దాతలు స్పందించారు. పాఠశాలలో ఒకే మూత్రశాల ఉంది. దాన్ని 174 మంది విద్యార్థినులతో పాటు మహిళా ఉపాధ్యాయులు వినియోగించుకుంటున్నారు. మూత్రశాలకు వెళ్లటానికి విద్యార్థినులు క్యూలో నిల్చుని ఇబ్బందులు పడుతున్న దృశ్యం 'సాక్షి' కంట పడింది. దీనిపై కథనాన్ని ప్రచురించగా చలించిన పలు స్వచ్ఛంద సంస్థలు, దాతలు పాఠశాలలో మూత్రశాలలతో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు ముందుకొచ్చారు. హైదరాబాద్ మాదాపూర్‌కు చెందిన ఎన్‌సీసీ లిమిటెడ్ యాజమాన్యం రూ.35 లక్షలతో బాలబాలికలతో వేర్వురుగా మూత్రశాలలు నిర్మించింది. వీటిని 2023వ ఫిబ్రవరి 9వ తేదీన ఎన్‌సీసీ డైరెక్టర్ ఎం.పెద్దిరాజు పాఠశాలకు అప్పగించారు.

చాలా ఇబ్బంది పడేవాళ్లం



గతంలో పాఠశాలలో ఒకే మూత్రశాల ఉండటంతో చాలా ఇబ్బంది పడేవాళ్లం. ఇంటర్వెల్ సమయంలో పావుగంట ముందుగానే మమ్ముల్ని వదిలేవాళ్లు. ఎండ, వానలోనూ క్యూలో నిల్చువాల్సి వచ్చేది. సాక్షి దినపత్రికలో వచ్చిన కథనంతో మాకు ఇబ్బందులు తొలగిపోయాయి. ప్రస్తుతం అబ్బాయిలు, అమ్మాయిలకు వేర్వేరుగా మూత్రశాలలు నిర్మించారు. సాక్షికి కృతజ్ఞతలు.

\- డి.మౌనిక, 8వ తరగతి

నియోజకవర్గానికి జానారెడ్డి చేసింది శూన్యం

- ఎమ్మెల్యే నోముల భగత్

తిరుమలగిరి(నాగార్జునసాగర్): 35 ఏళ్ల ఎమ్మెల్యేగా, 18 శాఖలకు మంత్రిగా పనిచేశానని గొప్పలు చెప్పుకొనే జానారెడ్డి నాగార్జునసాగర్ నియోజకవర్గానికి చేసిన పని శూన్యమని ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్ అన్నారు. గురువారం మండలంలోని నెల్లికల్లు గ్రామంలో టీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తలాపున కృష్ణమ్మ ప్రవహిస్తున్నప్పటికి కృష్ణపట్టె ప్రాంతానికి తాగు, సాగునీరు ఇవ్వాలన్న సోయి కూడా జానారెడ్డికి లేదని, నెల్లికల్లు లిఫ్టును తానే డిజైన్ చేశానని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మండలానికి సామాంత రాజులను తయారు చేసి హెదరాబాద్ కేంద్రంగా పరిపాలన చేసిండే కానీ, ఏనాడు కూడా ప్రజల మధ్య ఉండి వారి సమస్యలను పట్టించుకోలేదని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జ్ ఎమ్మెల్సీ కడియం శ్రీహరి పాల్గొనాల్సి ఉన్నప్పటికీ అనివార్య కారణాల వల్ల పాల్గొనలేదు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, మార్కెట్ చైర్మన్లు జవ్వాజి వెంకటేశ్వర్లు, మర్ల చంద్రారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు పిడిగం నాగయ్య ,బహునూతల నరేందర్, జటావత్ రవి నాయకులు బ్రహ్మారెడ్డి, రామచంద్రయ్య, సుజాత, కాశయ్య పాల్గొన్నారు.


తిరుమలగిరి : నెల్లికల్లులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నోముల భగత్

సమ్మేళనానికి దూరంగా ఎమ్మెల్సీ వర్గం

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల మధ్య వర్గపోరు మరలా బయటపడింది. పార్టీలో వర్గపోరును తగ్గించి అందరం ఒక్కటే, అంతా ఒకే కుటుంబం, అందరు కలిసి పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ చేపట్టిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం ఆ దిశగా అడుగు వేయడం లేదనడానికి తిరుమలగిరి మండలంలో గురువారం నిర్వహించిన సమ్మేళనం నిదర్శనమని చెప్పవచ్చు. ఎంపీపీ, జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీతో పాటు మరి కొన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఎమ్మెల్సీ వర్గంలో ఉన్నారు. సమావేశం ఏర్పాటు చేసినా నెలికల్లు గ్రామ సర్పంచ్‌కు సమాచారం కూడా తెలియపరచలేదని ఆ గ్రామ సర్పంచ్ పమ్మి జనార్దన్‌రెడ్డి తెలిపారు. పార్టీ కార్యక్రమం అయినప్పటికీ తమకు ఎలాంటి సమాచారం అందించకుండా సమ్మేళనాలు నిర్వహించడం ఏంటని ఎమ్మెల్సీ కోటిరెడ్డి వర్గీయులు ఆరోపిస్తున్నారు.

ప్రజల దీవెనలతో మరిన్ని పథకాలు

నిడమనూరు : రాష్ట్రంలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న కేసీఆర్ ప్రభుత్వాన్ని ప్రజలు దీవించాలని, అలా దీవిస్తేనే భవిష్యత్ మరిన్ని సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతారని ఎమ్మెల్యే నోము భగత్ అన్నారు. మండలంలోని శాఖాపురంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని ఎమ్మెల్యే నోముల భగత్ గురువారం సందర్శించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పరిమళ, హన్మంతరావు, రవి, సత్యపాల్, సూర్యనారాయణ, సత్యనారాయణరెడ్డి, వెంకటయ్య, బొజ్జ లాజర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో ఉద్యమించాలి

మిర్యాలగూడ అర్బన్ : స్వాతంత్ర్య సమర యోధుడు విప్లవ వీరుడు భగత్ సింగ్ 92వ వర్ధంతిని పట్టణంలో గురువారం ఘనంగా నిర్వహించారు. సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు భగత్ సింగ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంసీపీఐయూ, జనమైత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు లింగానాయక్, ఎండి.సయ్యద్, వెంకన్న, రమేష్, గీతగోవిందం, శ్రీను, ఎంసీపీఐయూ నాయకులు కిరణ్, మట్టయ్య, గోపి, కాశి, మోహన్‌నాయక్, ఆశీర్వాదం, జ్యోతి, ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మునీర్ అహ్మద్ షరీఫ్, పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని బీసీ బాలుర వసతి గృహంలో షాహీద్ దివస్ దినోత్సవాన్ని పురస్కరించుకోని బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సుఖ్‌దేవ్, భగత్‌సింగ్ రాజ్‌గురుల వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజు లింగంగౌడ్, నాయకులు బంటు వెంకటేశ్వర్లు, మహేష్ గౌడ్, వంశీ, సంజీవ్, కోటేష్, కిరణ్, నవీన్, వరప్రసాద్, మధు, వంశీ, అరవింద్, కృష్ణ, సూర్య, శ్రీను, విజయ్, రవి, శ్రీనాధ్, పవన్, రాకేష్ పాల్గొన్నారు.

దేవరకొండ : పట్టణంలోని ఎంకేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 92వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నూనె సురేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పోలె పవన్, వహజ్, సమీర్, జ్యోతి, వెన్నెల పాల్గొన్నారు.


మిర్యాలగూడ టౌన్ : అమరుల చిత్రపటాలకు పూలమాల వేస్తున్న నాయకులు

హాలియా : మండలంలోని చల్లారెడ్డిగూడెం జెడ్పీహెచ్‌ఎస్‌లో గురువారం స్వాతంత్ర్య పోరాట యోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకన్న, ఉపాధ్యాయులు అమృతయ్య, సైదులురావు గౌతమ్, రామకృష్ణ, సునిత, శ్యామలాదేవి, తీగల మల్లిఖార్జున్, శ్రీనివాస్, చంద్రకళ పాల్గొన్నారు.

చింతపల్లి : మండల కేంద్రంలో గురువారం భగత్ సింగ్ వర్ధంతిని ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు.ఈ కార్యక్రమంలో నాయకులు షంషొద్దీన్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

డిండి : మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో భగత్‌సింగ్ 92వ వర్ధంతి వేడుకలు ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో ఆ సంఘం డివిజన్ అధ్యక్షుడు సురగి వినయ్‌కుమార్, ఆ సంఘం అధ్యక్షుడు అబ్దుల్ రియాజ్,భాను, అరవింద్, అమ్ములు, పాల్గొన్నారు.


పెద్దఅడిశర్లపల్లి : ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో..


హాలియా : భగత్ సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

పెద్దఅడిశర్లపల్లి : విప్లవ నాయకుడు షహీద్ భగత్ సింగ్ స్ఫూర్తితో ఉద్యమించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి బుడిగ వెంకటేష్ పిలుపునిచ్చారు. గురువారం భగత్‌సింగ్ 92వ వర్ధంతి సందర్భంగా మండలంలోని దుగ్యాల మోడల్ స్కూల్‌లో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాము,దున్న రవి, మనోహర్, మహేష్, రాజు, సోమేష్, అశ్విని, అనిత, రేణుక పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

హాలియా : భారత రాజ్యాంగ నిర్మాణ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధన కోసం దళిత సంఘాలు కృషి చేయాలని దళిత సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పోలే రవి పిలుపునిచ్చారు. దళిత సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం మండలంలోని చల్మారెడ్డిగూడెంలో నిర్వహించిన దళిత చైతన్య గ్రామ సభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆ కార్యక్రమంలో సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ప్రభాకర్, మాజీ సర్పంచ్ మారయ్య, కోటేష్, రాములు, సత్తయ్య, కోటయ్య, కోటయ్య, వెంకటయ్య, చిన వెంకటయ్య ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత


నగదు అందజేస్తున్న యూనియన్ సభ్యులు

కొండమల్లేపల్లి : ఇటీవల మృతి చెందిన కొండమల్లేపల్లి మండల కేంద్రానికి చెందిన సంపెంగల సురేందర్ కుటుంబానికి రాష్ట్ర ఫొటో గ్రాఫర్స్ ఆధ్వర్యంలో రూ.1.45లక్షలను గురువారం ఆర్థికసాయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఫొటో గ్రాఫర్స్ జిల్లా అధ్యక్షుడు శ్రీమన్నారాయణ మాట్లాడారు. తమవంతుగా ఆర్థిక సహకారం అందించి సురేందర్ కుటుంబానికి బాసటగా నిలిచినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ, కొండమల్లేపల్లి ఫొటో గ్రాఫర్స్ మండలాల అధ్యక్షులు భాస్కర్, గంధం సురేస్, యూనియన్ సభ్యులు కేశవరెడ్డి, ప్రదీప్, శంకర్‌గౌడ్, నవకాంత్ పాల్గొన్నారు.

చిరుధాన్యాల్లో పోషకాలు అధికం

మిర్యాలగూడ టౌన్ : చిరుధాన్యాల్లో పోషకాలు అధికంగా ఉంటాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేవతి అన్నారు. పోషణ్ పక్వాడ్‌లో భాగంగా భాగంగా గురువారం పట్టణంలోని గాంధీనగర్ సెక్టర్ పరిధిలో ని అంగన్‌వాడీ కేంద్రం-1, విద్యానగర్ అంగన్‌వాడీ కేంద్రం-2, పాపోసుల దిబ్బ అంగన్‌వాడీ కేంద్రం-3లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సీడీపీఓ రేఖ మమత ఆదేశాల మేరకు చిరుధాన్యాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు బ్లాక్ కో ఆర్డినేటర్ కవిత, అంగన్‌వాడీ టీచర్లు అరుణ, ఉమారాణి, పాల్గొన్నారు.

అడవిదేవులపల్లి : మండలంలోని మొల్కచర్ల గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ ప క్వాడ కార్యక్రమంలో భాగంగా గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కేంద్రంలోని పెరటితోటలు, చిరుధాన్యాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్ అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

నాగార్జునసాగర్ : ఐసీడీఎస్ అనుముల ప్రాజెక్టు చలకుర్తి సెక్టార్ పరిధిలోని నందికొండ మున్సిపాలిటీ హిల్‌కాలనీలోని నాలుగో అంగన్‌వాడీ కేంద్రంలో పోషన్ పక్వాడ కార్యక్రమాన్ని గురువారం సూపర్‌వైజర్ గొసియాబేగం ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ శారదదేవి, పాల్గొన్నారు.

డిండి : మండల పరిధిలోని తవక్లాపూర్ గ్రామంలో అంగన్‌వాడీ ఆధ్వర్యంలో గురువారం పోషణ పక్వాడలో చిరుధాన్యాలపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వంకేశ్వరం అలివేలు, రమణ, విమల, రమా వెంకట్, జయమ్మ, మంగ పాల్గొన్నారు.


హాలియా : మాట్లాడుతున్న సీడీపీఓ పద్మావతి

హాలియా : పౌష్టికాహారంతోనే పిల్లలు, తల్లులు, గర్భిణులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీఓ గంధం పద్మావతి అన్నారు. ఐసీడీఎస్ అనుముల ప్రాజెక్టు పరిధిలోని పాలెం, మారేపల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో, ప్రాథమిక పాఠశాల, జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన పోషణ పక్వాడ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. సూపర్ వైజర్ సరిత, అంగన్‌వాడీ టీచర్లు ఆయాలు పాల్గొన్నారు.

నిడమనూరు : మండల కేంద్రంలోని కేజీబీవీ, ప్రాథమిక పాఠశాలలో గురువారం చిరు ధాన్యాల (మిల్లెట్లు) వల్ల కలిగే ప్రయోజనాలు, హ్యాండ్ వాష్ విధానం గురించి వివరించడంతో పాటు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. సీడీపీఓ పద్మావతి ఎంఈఓ బాలునాయక్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సైదాభేగం, ఉపాధ్యాయురాలు పాల్గొన్నారు.

దేవరకొండ : దేవరకొండ మండల పరిధిలోని ముదిగొండ ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులకు 'సిరిదారి-ఆరోగ్య రహదారి' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు ప్రదానం చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాధ, విజయలక్ష్మీ, హెచ్‌ఎం వేలాద్రి పాల్గొన్నారు.

ఆపద సమయాల్లో అండగా సీఎంఆర్‌ఎఫ్

దేవరకొండ : ఆపద సమయాల్లో వైద్య ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయనిధి ఫండ్ (సీఎంఆర్‌ఎఫ్) అండగా ఉంటుందని ఎమ్మెల్యే రవీంద్రకుమార్ అన్నారు. దేవరకొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని ఆయా మండలాలకు చెందిన 63మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.20.60లక్షల విలువైన చెక్కులను ఆయన గురువారం పంపిణీ చేసి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం ఎన్నో సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టి అమలు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నర్సింహ, ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి, జెడ్పీటీసీ అరుణసురేష్‌గౌడ్, నాయకులు కృష్ణయ్య, దస్రునాయక్, వల్లపురెడ్డి, నర్సింహ, కృష్ణ, శేఖర్, రాములు పాల్గొన్నారు.


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలకు రెడ్ నోటీసులు


రెడ్ నోటీసులు అందజేస్తున్న మున్సిపల్ అధికారులు

మిర్యాలగూడ టౌన్ : ప్రభుత్వ శాఖలలో ఆస్తి పన్నుల బకాయిదారులకు గురువారం మున్సిపల్ కమిషనర్ రవీందర్‌సాగర్ ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు రెడ్ నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ రెవెన్యూ అధికారిని కళ్యాణి మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నెల 31వ తేది వరకు బకాయిదారులందరూ ఆస్తి పన్నులను చెల్లించకుంటే జప్తి చేసే విధంగా చర్యలు తీసుకోనున్నట్లు తెఇపారు. ప్రస్తుతం ఎంపీడీఓ కార్యాలయం, టీఎస్‌జీఓ షాపులు, థీయేటర్, ఎంపీడీఓ కార్యాలయంలో ఈఈ కార్యాలయం, మిర్యాలగూడ ఫంక్షన్‌హాల్‌తో పాటు పలు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలతో పాటు మరి కొన్ని శాఖలకు రెడ్‌నోటీసులను జారీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్య క్రమంలో ఆర్.రాకేష్ , బిల్ కలెక్టర్లు ఖలీల్, పుష్పలత, రమేష్, యాదగిరి, ఎల్లయ్య, బిక్షం, జూనియర్ అసిస్టెంట్లు శ్రీనివాస్, సైదులు పాల్గొన్నారు.

పేదింటి ఆడబిడ్డ వివాహానికి కల్యాణలక్ష్మి కానుక

వేములపల్లి : మండలంలోని మొల్కపట్నం గ్రామంలో పేదింటి కుటుంబానికి చెందిన బొమ్మగాని స్రవంతి తల్లిదండ్రులు బొమ్మగాని సైదులుసైదమ్మ మృతిచెందగా ఆమె వివాహం సందర్భంగా మాజీ ఎంపీపీ నామిరెడ్డి రవీణాకరుణాకర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డిలు 'గ్రామ కల్యాణలక్ష్మి కానుక'గా రూ.25వేలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామంలో పేదింటి ఆడబిడ్డల వివాహ సమయంలో తమవంతుగా సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా గ్రామంలో ఎవరైనా మృతిచెందినట్లయితే వారి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించడంతోపాటు బంధువులకు భోజనాలు అందిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో పందుల జానకిరాములు, కానుగు రాములు, భారి లింగయ్య, బ్రహ్మచారి, శ్రీనివాస్‌రెడ్డి, పందుల సైదులు, రమణయ్య, బీమయ్య జానకిరాములు, పోలబోయిన సైదులు, రాచూరి సైదులు, పెద్ద సైదులు, కన్నెబోయిన రమేష్, యాదగిరి, కోడి సైదులు, భారి నాగరాజు, కప్పల అంజి, నరేందర్, సైదమ్మ, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.


స్రవంతికి కల్యాణలక్ష్మి కానుక అందజేస్తున్న మాజీ ఎంపీపీ నామిరెడ్డి, రవీణాకరుణాకర్‌రెడ్డి

ఓడీఎఫ్‌పై శిక్షణ

తిరుమలగిరి(నాగార్జునసాగర్): జిల్లా స్వచ్ఛభారత్ మిషన్ గ్రామీణ నల్లగొండ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వచ్ఛభారత్ మిషన్ జిల్లా కో-ఆర్డినేటర్ శంకర్ బాబు మాట్లాడుతూ ఓడీఎఫ్, సుస్థిరత, ఘనవ్యర్థ పదార్థాల నిర్వహణ, ప్లాస్టిక్ నిర్వహణ మీద శిక్షణ నిచ్చినట్లు తెలిపారు. అలాగే నీటి నిర్వహణ, పారిశుద్ధ్య ప్రణాళిక తయారీ గురించి అవగాహన కల్పించారు. ఈ శిక్షణ తరగతులకు ముఖ్య అతిథిగా ఎంపీపీ భగవాన్‌నాయక్ పాల్గొని ప్రారంభించారు. ఈ శిక్షణ తరగతులు ఈ నెల 25వ తేదీ వరకు జరగనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఖాజా అజ్గర్‌అలీ, ఎంపీఓ పద్మ, సర్పంచ్‌లు, కార్యదర్శులు, ఏపీఎంలు, పాల్గొన్నారు.

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి

దేవరకొండ : పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలని దేవరకొండ ఆర్డీఓ గోపీరాం అన్నారు. గురువారం దేవరకొండ మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన శాంతి సంఘం సమావేశంలో దేవరకొండ డీఎస్పీ నాగేశ్వర్‌రావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న శ్రీరామ నవమి, హనుమాన్ జయంతి, రంజాన్ పర్వదినాలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. పండుగల నేపథ్యంలో ఆయా శాఖల అధికారులు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఆయన సూచించారు. అనంతరం డీఎస్పీ నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, ఇన్‌చార్జ్ సీఐ శ్రీనివాసులు , కమిషనర్ వెంకటయ్య, వైస్ చైర్మన్ రహత్‌అలీ, శాంతిసంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


దేవరకొండ : మాట్లాడుతున్న ఆర్డీఓ గోపీరాం

మత సామరస్యానికి ప్రతీక రంజాన్ మాసం

కొండమల్లేపల్లి : పవిత్ర రంజాన్ మాసం మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని కొండమల్లేపల్లి సీఐ శ్రీనివాస్ అన్నారు. పవిత్ర రంజాన్ మాసం ప్రారంభమవుతున్న నేపథ్యంలో గురువారం ముస్లిం మత పెద్దలతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్ఐ వీరబాబు,ముస్లిం మత పెద్దలు మహమ్మద్ గౌస్‌పాషా, సలీం, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.